## క్లుప్తంగా

### ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



తాడిపర్రులో కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు

**ఉండ్రాజవరం:** విశ్వ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తాడిపర్రు గ్రామంలో గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి స్వామి వారికి, అమ్మవారికి ఘనంగా కల్యాణం నిర్వహించారు. బుధవారం ఉదయం స్వామి వారికి పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం భక్తులు స్వామివారిని దర్శనం చేసుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

**తాళ్లపూడి:** వైజాగ్‌లో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయిన మండలంలోని తిరుగుడుమెట్టకు చెందిన కుటుంబానికి మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ అండగా నిలిచింది. ఈ ప్రమాదంలో ఈ గ్రామానికి చెందిన హనుమంతు ఆనందరావు, ఆయన కుమారుడు చంద్రశేఖర్ మృతి చెందారు. మానవత సంస్థ మండల శాఖ తరఫున బుధవారం రూ.6వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుమార్తె ఇంటర్ చదువు నిమిత్తం ఆ సంస్థ ఈ ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో ఆ సంస్థ రీజనల్ చైర్మన్ వి. చంద్రయ్య, ప్రతినిధులు తిగిరిపల్లి దోశాలు, సనపల రాజశేఖర్, అల్లూరి రాంబాబు, అన్నంరెడ్డి సత్తిబాబు, ఇల్లూరి బాజ్జితదితరులున్నారు.

### చలి వేంద్రంలో మజ్జిగ పంపిణీ



చాగల్లు చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

**చాగల్లు:** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో చాగల్లులో బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆత్కూరి నర్సింహమూర్తి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుడైన రాము దాతృత్వంతో శ్రీ కాకతీయ కల్యాణ మండపం వద్ద మజ్జిగ పంపిణీ చేసినట్టు సేవాసంస్థ నిర్వాహకులు తెలిపారు. గత 44వ రోజులుగా దాతలు సహకారంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

### ఉపాధి పనుల తనిఖీ

**చాగల్లు:** స్థానికంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో ఎస్.బుజ్జి బుధవారం తనిఖీ చేశారు. ఆమె కూలీలతో మాట్లాడారు. ఈ మస్టరు విధానాన్ని పారదర్శకంగా నిర్వహించాలని, పనుల్లో నాణ్యత ఉండేలా పర్యవేక్షించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, దారవరం, కలవలపల్లి, చాగల్లు, చంద్రవరం తదితర గ్రామాల్లో పంటబోదుల్లో పూడిక తీత పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారని ఎంపీడీవో వివరించారు. టెక్నికల్ అసిస్టెంట్ భాస్కర్ ఉన్నారు.

# యోగా.. ఒంటికి మంచిదేగా..

- విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం
- దూబచర్ల యోగా, చెస్ శిబిరాలకు విశేష స్పందన
- సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న విద్యార్థులు

**నల్లజర్ల:** ప్రస్తుతం విద్యార్థులకు వేసవి సెలవులు. విద్యా సంస్థలకు సెలవు కావడంతో తల్లిదండ్రులు వారిని బంధువుల ఇళ్లకు పంపడం, పర్యాటక ప్రాంతాలకు తీసుకు వెళ్లడం సహజం. సరదాగా సెలవులను గడిపేస్తే ఏం ప్రయోజనం ఉండదు. తల్లిదండ్రులు కాస్త ఆలోచిస్తే వేసవి సెలవులు సద్వినియోగం అవుతాయి. పిల్లల అభిరుచి మేరకు వారి శారీరక, మానసిక వికాసానికి దోహదపడేలా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకంగా మండలంలోని దూబచర్లలో యోగా, చెస్‌లలో శిక్షణ ఏర్పాటు చేసింది. గత నెల 30వ తేదీ నుంచి ఈ శిక్షణ శిబిరాన్ని దూబచర్లలోని సంఘమిత్ర స్కూల్లో నిర్వహిస్తున్నారు. ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ యోగా, అనంతరం ఒక గంట సేపు చెస్‌లో శిక్షణ ఇస్తున్నారు. దూబచర్ల జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ దూబగుంట్ల రాజారావు నేతృత్వంలో ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందుకు లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ, పార్థ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ తోడ్పాటు అందిస్తున్నాయి.

యోగా సాధన పిల్లల్లో ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత పెంచుతుంది.దూబచర్ల సంఘమిత్ర స్కూల్లో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభిస్తోంది. రోజూ ఉదయం ఒక గంట సేపు యోగాసనాలు, ప్రాణాయామం సాధనకు కేటాయిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారు కావడానికి ఇవి రెండూ ఎంతగానో దోహదపడతాయని నిపుణులు సూచిస్తున్నారు. 10 నుంచి15 నిమిషాల పాటు సూక్ష్మ వ్యాయామాలు చేయిస్తారు. తద్వారా శరీరంలోని ప్రతి అవయవం యోగాసనాలు వేయడానికి సిద్ధం అవుతుందని యోగా గురువు రాజారావు తెలిపారు. చిన్నారులలో స్థిరత్వాన్ని కల్పించడానికి నటరాజాసనం, త్రికోణాసనం, ఏకపాద ఆసనం వంటివి నేర్పుతున్నట్టు చెప్పారు. కంటికి బలాన్ని అందించేలా త్రాటక వ్యాయామం చేయిస్తున్నట్టు చెప్పారు. శరీరంలోని అన్ని అవయవాలు అనుసంధానం అయ్యేలా సూర్య నమస్కారాలతో చిన్నారులతో సంపూర్ణ వ్యాయామ సాధన చేస్తున్నట్టు వివరించారు. మనసుకు స్థిరత్వాన్ని ఇచ్చే ప్రాణాయామం, ఓంకార సాధన చేయిస్తున్నట్టు చెప్పారు. అలాగే విద్యార్థుల అభీష్టం మేరకు కొంతమందికి చెస్‌లో తర్ఫీదు ఇస్తున్నట్టు రాజారావు చెప్పారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

**యోగా సాధన బాగుంది**



వేసవి సెలవులలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణ శిబిరం చాలా బాగుంది. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇంటి వద్ద సాధన చేస్తున్నాను. ఏకాగ్రత పెరగడానికి, బాగా చదువుకోవడానికి ,శారీరక వ్యాయామానికి ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– సీహెచ్.రూపశ్రీలక్ష్మి, 8వ తరగతి విద్యార్థిని, దూబచర్ల

**ఏకాగ్రత పెరిగింది**



రెండు వారాలకు పైగా ఇక్కడ యోగా, చెస్‌లలో శిక్షణ పొందడం వల్ల నాకు ఏకాగ్రత పెరిగింది. అదే సమయంలో కోపం, చిరాకు వంటి అంశాలు దరి చేరడం లేదు. యోగా సాధనతో ఒక విధమైన ప్రశాంతత కలుగుతుంది.

– ఆర్.చాందిని, 8వ తరగతి విద్యార్థిని, దూబచర్ల

**తొమ్మిదేళ్లుగా..**



విద్యార్థుల కోసం వేసవి సెలవుల్లో గత తొమ్మిదేళ్లుగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాం. రెండేళ్లుగా చెస్ శిక్షణ సాగుతోంది. యోగాలో 60 మంది, చెస్‌లో 40 విద్యార్థులు రోజూ శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం పోటీలు నిర్వహించి బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్నాం.

– దూబగుంట్ల రాజారావు, పీడీ, యోగా గురువు, దూబచర్ల జెడ్పీ హైస్కూల్

### సిమెంట్ బెంచీల ఏర్పాటు



నిడదవోలులో సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేస్తున్న రోటరీ సభ్యులు

**నిడదవోలు:** ప్రజల సౌకర్యార్థం నిడదవోలు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో బుధవారం 40 సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, సభ్యులు గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, ఖండవిల్లి రంగాచార్యులు, అద్దాల సత్య ప్రభాకర్, గుంటిపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, పోలదాసు శ్రీనివాసరావు, బలగం అప్పారావు, బొజ్జా పాపారావు, గొన్నాబత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### 18న మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాల వేలం

**నిడదవోలు:** స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (సెబ్) నిడదవోలు స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలకు ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు సీఐ కె.వీరబ్రహ్మం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తమ ఆధార్‌కార్డు తీసుకుని వచ్చి ధరావత్తుగా రూ.5000 చెల్లించాలన్నారు. వేలంలో ద్విచక్ర వాహనాలు దక్కించుకున్న వారు వేలం ముగిసిన వెంటనే వేలం సొమ్ముతో పాటు జీఎస్టీ అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 949150 3885 నంబర్‌ను సంప్రదించాలని సీఐ కె.వీరబ్రహ్మం తెలిపారు.

# భావితరాలకు ఆదర్శం కాటన్

అపర భగీరథునికి పలుచోట్ల నివాళి

**కొవ్వూరు (తాళ్లపూడి):** ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణంతో గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ భావి తరాలకు ఆదర్శమని రైస్ అండ్ కిరణా మర్చంట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్ అన్నారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతిని బుధవారం కొవ్వూరు పట్టణంలో రైస్, కిరణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు బైపాస్ రోడ్డు జంక్షన్ వద్ద గల కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్‌ఐసీ సెంటర్లోని కాటన్‌దొర విగ్రహానికి వారు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి పాకా శ్రీనివాస్ మాట్లాడుతూ ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణంతో తరతరాలకు కాటన్ గుర్తుండిపోయారన్నారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి నాగ రమేష్, కొత్త ప్రసాద్, మద్దుల వీర సోమరాజు, నాళం శ్రీనివాస్, వంకాయల శివ తదితరులు పాల్గొన్నారు.

**శెట్టిపేటలో..**

**నిడదవోలు:** నీటి ఎద్దడి వల్ల రైతులు కరవు పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి నదిపై బ్యారేజీ నిర్మించడంతో గోదావరి ప్రాంతం సస్యశ్యామలం అయ్యిందని శెట్టిపేట నీటిపారుదల శాఖ డివిజన్ టెక్నికల్ అధికారి, ఏపీ ఎన్జీవోల అసోషియేషన్ అధ్యక్షుడు కె.నందీశ్వరుడు అన్నారు. శెట్టిపేటలోని నీటిపారుదల ఎగ్జిక్యూటివ్ కార్యాలయ ఆవరణలో సర్ ఆర్థర్ కాటన్ జయంతిని బుధవారం నిర్వహించారు. నందీశ్వరుడు ఆధ్వర్యంలో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కె.నాగేశ్వరరావు, బి.కిషోర్, కె.శ్రీనివాస్, కె.రామ సత్యనారాయణ, పి.రాధాకృష్ణ, ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొవ్వూరు ఎల్ఐసీ ఆఫీసు వద్ద గల కాటన్ విగ్రహానికి రైస్ అండ్ కిరణా మర్చంట్స్ అసోసియేషన్ సభ్యుల నివాళి



శెట్టిపేటలో కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నందీశ్వరుడు, సిబ్బంది



పసలపూడిలో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గోడిచర్ల లాక్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్

**పసలపూడిలో..**

**ఉండ్రాజవరం:** కాటన్ జయంతి సందర్భంగా మండలంలోని పసలపూడి గ్రామంలోని గోడిచర్ల లాక్ వద్ద బుధవారం ఆయన విగ్రహానికి జలవనరుల శాఖ గోడిచర్ల లాక్ సూపరింటెండెంట్ ముప్పిడి విజయ్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లస్కర్లు, రైతులు పాల్గొన్నారు.

# మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు

**దేవరపల్లి:** వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టారు. నీటి ఎద్దడి గల ప్రాంతాలను గుర్తించి బోర్లు, పైపులైన్ల నిర్మాణం చేపట్టి ఆఘమేఘాలపై పూర్తి చేశారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో పాటు పంచాయతీ నిధులను జత చేసి కొత్తగా బోర్లు వేయించారు. జిల్లా పరిషత్ నిధులు రూ.6 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, త్యాజంపూడి పంచాయతీ నిధులు రూ.3 లక్షలు మొత్తం రూ.13 లక్షలతో త్యాజంపూడి జెడ్పీ హైస్కూలు ప్రాంతంలో బోరు వేశారు. ఈ బోరు సాయంతో ఆ గ్రామంలోని పల్లపు వీధి, వడ్డెర్ల వీధికి మంచినీటి పైపులైన్ వేసి సుమారు 500 కుటుంబాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్టు సర్పంచ్ కుసుకూరి స్వరూపరాణి, ఉప సర్పంచ్ కుసులూరి వెంకట సతీష్ బుధవారం తెలిపారు. దీనివల్ల రెండు ప్రాంతాల్లో మంచినీటి సమస్య పరిష్కారం అయిందని వెంకట సతీష్ చెప్పారు. అలాగే దేవరపల్లి-యాదవోలు రోడ్డులో మండల పరిషత్ నిధులు రూ.11 లక్షలతో కొత్తగా బోరు వేశారు. అక్కడి నుంచి మూడు కిలో మీటర్ల దూరంలోని చంద్రబాబు కాలనీకి రూ.30 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో పైపులైన్ నిర్మించినట్టు దేవరపల్లి కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి తెలిపారు. రూ.40 లక్షలతో దేవరపల్లి సీబీఎస్ కాలనీకి మంచినీటి సదుపాయం కల్పించినట్టు ఎంపీపీ తెలిపారు. దాదాపు 20 ఏళ్లుగా కాలనీ వాసులు మంచినీరు లేక నుద్దనీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకున్న ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరించారు.



త్యాజంపూడిలో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన మంచినీటి బోరు



దేవరపల్లి-యాదవోలు రోడ్డులో ఏర్పాటు చేసిన మంచినీటి బోరు

## పాస్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

**నల్లజర్ల:** యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం అచ్చన్నపాలెంలోని ఈసీ ఎఫ్ చర్చిలో జరిగింది.ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా డి.శ్యాంబాబు, ఎం.ప్రసాద్‌బాబు, జె.ఆశీర్వాదం ఎంపికయ్యారు. అధ్యక్షుడిగా పి.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎం .ఇశ్రాయిల్ రాజు, కార్యదర్శిగా ఎస్.సురేష్, సహాయ కార్యదర్శిగా పి.యేసురాజు, కోశాధికారిగా కె.రాజు, సహాయ కోశాధికారిగా బి.పండు నియమితులయ్యారు. మరో ఐదుగురు సలహాదారులు, ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.వారంతా ప్రమాణ స్వీకారం చేశారు.

## గ్రామదేవత పూరి గుడిసె వద్ద పూజలు



మార్కొండపాడు గ్రామదేవత పూరి గుడిసె వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**చాగల్లు:** మార్కొండపాడు గ్రామదేవత మహాలక్ష్మమ్మ వారి జాతర వేడుకల్లో భాగంగా అమ్మవారి పూరిగుడిసె వద్ద బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నెలలో నడివీధిలోని పూరిగుడిసె వద్దకు డప్పు వాయిద్యాల ఊరేగింపుతో అమ్మవారిని తీసుకొచ్చారు. ఈ సందర్భంగా రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, భజనలు నిర్వహిస్తున్నారు.జాతర వేడుకల్లో భాగంగా ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. వచ్చే నెల 8, 9 తేదీలలో జాతర వైభవంగా నిర్వహించనున్నట్టు చెప్పారు.

## గోదావరిలో మునిగి యువకుడి మృతి



బాలాజీ (ఫైల్)

**కొవ్వూరు (తాళ్లపూడి):** గోదావరి నదిలో స్నానానికి దిగిన యువకుడు మృతి చెందాడు. కొవ్వూరు రూరల్ ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తణుకు పట్టణానికి చెందిన చుక్క బాలాజీ ( 24) బుధవారం తన స్నేహితులు సమెల్లి సంతోష్‌కుమార్, దత్తు రోహిత్ రామసూర్యలతో కలిసి విజ్జేశ్వరం బ్యారేజీ గేట్- 36 వద్ద బుధవారం మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో గోదావరిలో స్నానానికి దిగాడు. అక్కడ నది లోతును గమనించకుండా, ప్రమాదవశాత్తూ కాలు జారి నీటిలోకి పడిపోయాడు. దాంతో నీటిలో మునిగి బాలాజీ మృతి చెందాడు. మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కొవ్వూరు రూరల్ ఎస్సై సుధాకర్ తెలిపారు.

## 19 నుంచి కల్యాణ మహోత్సవాలు

**సీటీఆర్ఐ:** రాజమహేంద్రవరం క్షేత్ర పాలక స్వామి శ్రీరుక్మిణీ సత్యభామా సమేత శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో స్వామివారికి ఈ నెల 19వ తేదీ నుంచి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని కార్యనిర్వహణాధికారి ఎన్ఎస్ పెద్దిరాజు పేర్కొన్నారు. 19న స్వామివారికి తిరువీధి ఉత్సవం , 20న నిత్య హోమం జరుగుతాయి.

## వ్యక్తి ఆత్మహత్య



వీర్రాజు మృతదేహం

**కొవ్వూరు(తాళ్లపూడి):** పట్టణంలోని రెండో వార్డుకు చెందిన బొట్టి వీర్రాజు (38) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కొవ్వూరు పట్టణ పోలీసుల కథనం ప్రకారం వీర్రాజు వడ్రంగి పని చేస్తుంటాడు. భార్య కృష్ణవేణి పలు ఇళ్లలో పని చేస్తుంది. మాంసం కూర వండాలని మంగళవారం ఉదయం వీర్రాజు తన భార్య కృష్ణవేణికి చెప్పాడు. అయితే ఆమె రాత్రికి వండుతానని చెప్పి కుమార్తెతో కలిసి పనికి వెళ్లిపోయింది. కృష్ణవేణి రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి తలుపు గడియ పెట్టి వీర్రాజు మంచం పక్కనే పడుకున్నట్టు ఆమె పోలీసులకు తెలిపింది. ఎంతకీ భర్త తలుపు తీయక పోవడంతో మద్యం మత్తులో ఉన్నాడని భావించి తాను సమీపంలోని తన తల్లి ఇంటికి వెళ్లిపోయినట్టు చెప్పింది. బుధవారం ఉదయం తాను ఇంటికి వచ్చి చూసే సరికి తలుపు తెరచి ఉందని, చీరతో ఉరివేసుకుని తన భర్త వీర్రాజు వేలాడుతూ కనిపించాడని ఆమె పోలీసులకు తెలిపింది. ఈ ఘటనపై వీర్రాజు తల్లి చక్ర సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై ప్రకాష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.